andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
నిర్మల్ జిల్లా వార్తలు
8
గురువారం 9 అక్టోబరు 2025



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్ రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరాలో గురువారం అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. పట్టణంలోని సోఫీనగర్‌లో సాగర్ కన్వెన్షన్‌హాల్, నేషనల్ హైవే ఏరియాలో చెట్లకొమ్మలను తొలగించే కార్యక్రమం ఉందన్నారు. గురువారం ఉదయం 9:30 గంటల నుంచి 11:30 గంటల వరకు సాగర్ కన్వెన్షన్ హాల్, హెచ్‌పీ పెట్రోల్ పంప్, హరిత రెస్టారెంట్ ఏరియాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. వినియోగదారులు సహకరించగలరని కోరారు.

స్థానిక సమరమే!





- నేటి నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్‌లు షురూ
- రెండు దశల్లో ఎన్నికలు
- మూడు దశల్లో పోలింగ్
- పల్లెల్లో హోరెత్తనున్న ఓట్ల సందడి
- అభ్యర్థుల ఖరారులో పార్టీలు



నామినేషన్ దాఖలు కేంద్రం ఇదే

నిర్మల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సమరానికి అంతా సిద్ధమైంది. గురువారం నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ఎన్నికకు సంబంధించి నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇప్పటికి దీనికి సంబంధించి ప్రభుత్వ యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లను చేపట్టింది. జిల్లాలోని 18 జడ్పీటీసీలు, 157 ఎంపీటీసీ సభ్యుల ఎన్నిక కోసం నామినేషన్‌లను స్వీకరించేందుకు ఏర్పాట్లును పూర్తి చేశారు. మొత్తం రెండు దశల్లో జరగనున్న ఈ ఎన్నికలకు సంబంధించి మొదటి దశ కింద ఖానాపూర్, పెంబి, కడెం, దస్తూరాబాద్, మామడ, లక్ష్మణచాంద, నిర్మల్, సోన్, సారంగాపూర్ మండలాల్లోని మొత్తం 75 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇదే సందర్భంగా జడ్పీటీసీ సభ్యుల ఎన్నికకు కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు. రెండో దశ కింద దిలావర్‌పూర్, నర్సాపూర్, లోకేశ్వరం, కుంటాల, భైంసా, కుభీర్, తానూర్, ముథోల్, బాసర మండలాల్లోని జడ్పీటీసీలతో పాటు 82 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్‌లను స్వీకరించనున్నారు. మొత్తం 157 ఎంపీటీసీలు, 18 జడ్పీటీసీ పదవులకు సంబంధించి రెండు దశల్లో ఎన్నికల ప్రక్రియను చేపట్టనున్నారు. ఈ ఎన్నికల అనంతరం గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అభ్యర్థుల అన్వేషణలో పార్టీలు...

కాగా పార్టీ గుర్తులపై జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరగనున్న కారణంగా ప్రధాన పార్టీలన్ని తమ అభ్యర్థుల ఎంపిక కోసం ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టాయి. అన్ని పార్టీలు బలమైన అభ్యర్థులను బరిలోకి దించి ఎలాగైనా గెలుపు సాధించాలని వ్యూహరచన సాగిస్తున్నాయి. మెజార్టీ జడ్పీటీసీ పదవులను గెలుపొంది జడ్పీ చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు పార్టీలు పోటాపోటీగా పావులు కదుపుతున్నాయి. అలాగే మండలాల వారిగా మెజార్టీ ఎంపీటీసీ స్థానాలను గెలుచుకొని ఆయా మండలాల్లో ఎంపీపీ పదవులను తమ ఖాతాలో వేసుకోవాలని పార్టీలన్ని సంసిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ, బీజేపీలు ఈ సారి జడ్పీ చైర్మన్ పదవిని దక్కించుకోవాలన్న వ్యూహంతో 18 జడ్పీటీసీ స్థానాల్లో బలమైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు నిర్ణయించింది. ఇప్పటికే జిల్లా ఇంచార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు పలుసార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించడమే కాకుండా బలమైన అభ్యర్థులను రంగంలోకి దించాలని ఆదేశించారు. కాగా బీజేపీ ఈ సారి దూకుడు ప్రదర్శించేందుకు సిద్ధమవుతోందని అంటున్నారు. తమ పార్టీ నుంచి ప్రజల్లో పట్టున్న నాయకులను రంగంలోకి దించేందుకు ఆ పార్టీ ప్రయత్నాలు మొదలపెట్టింది. ఎలాగైనా జడ్పీ పీఠాన్ని కైవసం చేసుకొని రాజకీయ రంగంలో చరిత్రను తిరగరాసేందుకు ఆ పార్టీ సమాయత్తమవుతున్నట్లు చెబుతున్నారు.

నేటి తీర్పుపై ఉత్కంఠ....

కాగా స్థానిక ఎన్నికలకు సంబంధించి బుధవారం కూడా హైకోర్టులో వాదనలు పూర్తి కాని కారణంతో గురువారంపైనే అందరి దృష్టి నిలుస్తోంది. ఓ వైపు నామినేషన్‌ల పర్వం మొదలవుతుండడం అలాగే హైకోర్టు తీర్పు వెలువడబోనుండడంతో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న ఆశావాహులతో పాటు అన్ని పార్టీల్లోని నాయకులు, కార్యకర్తలంతా తీవ్ర ఉత్కంఠకు లోనవుతున్నారు. ఒకవేళ హైకోర్టు తీర్పు ఎన్నికలకు వ్యతిరేఖంగా వస్తే పరిస్థితులు ఎలా ఉంటాయోనన్న ఆసక్తి సైతం నెలకొంటోంది. అయితే హైకోర్టులో బుధవారం రోజంతా స్థానిక ఎన్నికలపైనే వాదోపవాదాలు కొనసాగిన సంగతి తెలిసిందే. రాజకీయ పార్టీల నేతలంతా హైకోర్టులో జరుగుతున్న వాదోపవాదాలను ఎప్పటికప్పుడు ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల ద్వారా తెలుసుకుంటూ గడిపారు. ఎట్టకేలకు వాదనలు వాయిదా పడడంతో వారు మరోసారి ఉత్కంఠకు గురయ్యారు. గురువారం తీర్పు వెలువడే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతుండడంతో ఆ తీర్పు కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

మూడుదశల్లో ఎన్నికలు...

ఇదిలా ఉండగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల అనంతరం గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించేందుకు నిర్ణయించారు. మొత్తం జిల్లాలోని 400 గ్రామ పంచాయతీలను దశల వారిగా విభజించి వార్డు మెంబర్‌లతో పాటు అదే రోజూ సర్పంచ్ ఎన్నికలను కూడా నిర్వహించనున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్ నిర్వహించి అనంతరం సాయంత్రంలోగా ఫలితాలు ప్రకటించనున్నారు. మొత్తానికి అటు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల అనంతరం గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించబోతున్న కారణంగా పల్లెల్లో ఇక ఓట్ల సందడి ముమ్మరం కాబోతోంది.

చోరీ అయిన సెల్‌ఫోన్ల అప్పగింత



పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లను అందజేస్తున్న ఎస్పీ జానకిషర్మిల

నిర్మల్ రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : 72 ఫోన్లను పోలీసులు బాధితులకు అందజేశారు. ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆదేశానుసారం నిర్మల్ పోలీసులు మొబైల్ చోరీలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సీఈఐఆర్ పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగించి నెలరోజుల్లో 72 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. సెల్‌ఫోన్ పోయిన, చోరీకి గురైన ఆందోళన చెందవద్దని సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని ఎస్పీ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 72 మొబైల్ ఫోన్లు (ఎనిమిది లక్షల అరవై నాలుగు వేల విలువ గల ఫోన్లను) స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... మొబైల్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోయిన సెల్‌ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. పోయిన, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి సీఈఐఆర్ వెబ్‌సైట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో వినియోగదారులు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో వారి వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్‌ని ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. పోయిన సెల్‌ఫోన్ల రికవరీ కోసం ప్రత్యేక టీం ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 1735 ఫోన్లు సుమారుగా రెండు కోట్ల ఎనిమిది లక్షల ఇరవై వేల రూపాయల విలువ గల ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించారన్నారు. సెకండ్ హ్యాండ్ మొబైల్‌ఫోన్ల కొనుగోలు, విక్రయాలపై కఠినంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. వినియోగదారులు సెకండ్‌హ్యాండ్ మొబైల్స్ కొనేటప్పుడు అవి ఎక్కడి నుంచి వచ్చినవి, చోరీకి గురైనవో కాదో సరి చూసుకోవాలని, అనుమానం ఉన్న ఫోన్లను కొనరాదని తెలిపారు. అంతేకాకుండా వ్యక్తి వద్ద లేదా కొద్ది మంది వద్ద పెద్ద సంఖ్యలో మొబైల్ దొరికితే వారు ఏదైనా చోరీ ముఠా అనుమానాస్పద కార్యకలాపాలలో భాగమా అనే దానిపై సమగ్ర విచారణ చేయాలని అడిషనల్ ఎస్పీకి ప్రత్యేక సూచనలు ఇచ్చారు. సీఈఐఆర్ ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరికైనా సెల్‌ఫోన్లు దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో గాని, ఆ నెంబర్ వారికి ఫోన్ చేసి వారికి అప్పగించాల్సిందిగా సూచించారు.

దిలావర్‌పూర్ పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

దిలావర్‌పూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల నియంత్రణలో కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. బుధవారం దిలావర్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ప్రతిరోజు సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టాలని, అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నిరోధించాలని సూచించారు. గంజాయి పండించడం, రవాణా చేయడాన్ని పూర్తిగా రూపు మాపాలన్నారు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారి పట్ల మర్యాదగా వ్యవహరించాలని, పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పుకోకుండా సత్వర న్యాయం జరిగేలా ప్రయత్నించాలని ఎస్సై రవీందర్‌కు సూచించారు. పోలీసులు ప్రజలతో మమేకం అవుతూ మన పట్ల వారికి నమ్మకం కలిగించాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామాల్లో ప్రజలతో మంచి సత్సంబంధాలను ఏర్పరచుకొని నెట్‌వర్క్ పెంచుకోవాలన్నారు.

మీడియా సెంటర్ ప్రారంభించిన కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ, మీడియా మానిటరింగ్ సర్టిఫికేషన్ కమిటీ (ఎంసీఎంసీ)ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం సాయంత్రం ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని సమాచార శాఖ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించిన కలెక్టర్, అనంతరం అధికారులతో మాట్లాడుతూ... ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రతి వార్తపై నిఘా ఉంచాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా వచ్చే వార్తలు, ప్రచారాలు ఏవైనా గమనించిన వెంటనే వాటి వివరాలను సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో మీడియా పాత్ర ఎంతో ముఖ్యమని, వాస్తవాధారిత వార్తల ప్రచారంతో ప్రజల్లో విశ్వాసం పెంపొందుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం, అపోహలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, డీపీఆర్‌వో విష్ణువర్థన్, డీపీవో శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

- వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ఏర్పాట్లు పూర్తిచేశామని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కౌముదినితో వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. మొదటి విడతలో భాగంగా నేటి నుంచి ప్రారంభం కానున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు తగిన ఏర్పాట్లు అన్ని పూర్తి చేశామన్నారు. జిల్లాలో మొదటి విడతలో భాగంగా తొమ్మిది జడ్పీటీఈసీ, 75 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా నేటి నుంచి 11వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు చెప్పారు. నామినేషన్లు స్వీకరించే ఆర్వో కార్యాలయాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని వివరించారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, వీఎస్టీ బృందాలు సమర్థవంతంగా పని చేస్తున్నాయని తెలిపారు. ఆర్వో, ఏఆర్‌వోలకు ఇప్పటికే పలుమార్లు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అనంతరం ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ... నేటి నుంచి ప్రారంభం కానున్న మొదటివిడత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అన్ని నామినేషన్ స్వీకరణ ప్రక్రియను మొత్తం ఖచ్చితంగా వీడియో రికార్డింగ్ చేయాలన్నారు. మొదటి విడతలో భాగంగా నేటి నుంచి 11వ తేదీ వరకు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించాలని చెప్పారు. 12వ తేదీన నామినేషన్ల పరిశీలన, 15వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, 23వ తేదీన ఉదయం 7 గంటల నుంచి 5 గంటల వరకు పోలింగ్, వచ్చే నెల 11వ తేదీన ఫలితాలు ఉంటాయని చెప్పారు. నామినేషన్ కేంద్రాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి, అన్ని ఫారములు అందుబాటులో ఉంచాలని వివరించారు.

అట్టహాసంగా వెంకన్న రథోత్సవం


ఏకశిల కొండపై విద్యుత్ దీపాల వెలుగులో కాంతులీనుతున్న లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయం

ఖానాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుర్జాపూర్‌లో గల ఏకశిల కొండపై వెలసిన అతిపురాతన ఆలయమైన లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ఆలయ ప్రాంగణంలో జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతర కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వెంకన్న భక్తులు భారీగా తరలివచ్చారు. అశేష భక్తజన తాకిడితో ఏకశిల కొండ కిటకిటలాడింది. బుధవారం తెల్లవారుజామున సుర్జాపూర్ గ్రామ పుర వీధులలో స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. రథాన్ని ఊరేగించే సమయంలో భక్తులు చేసిన గోవింద నామస్మరణతో సుర్జాపూర్ గ్రామం మార్మోగింది. వేద పండితులు చక్రపాణి నరసింహా మూర్తి పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఆలయానికి అలంకరించిన విద్యుత్ దీపాల వెలుగులో ఏకశిలకొండ దగదగా మెరిసిపోయింది. కొండపై ప్రశాంత వాతావరణంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

బాసర విద్యార్థి ప్రతిభ


విద్యార్థి ఆదిత్య



ఆదిత్య తయారు చేసిన బ్లూటూత్ స్పీకర్

బాసర, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని బాసర మండలం కౌఠలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే 7వ తరగతి విద్యార్థి శోభన్కర్ ఆదిత్య పనికిరాని వస్తువులతో ఎలక్ట్రికల్ బ్లూటూత్ స్పీకర్‌ను తయారుచేసి చూపించాడు. విద్యార్థి ప్రతిభను గుర్తించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజ య్య, ఉపాధ్యాయ బృందం అభినందలు తెలిపారు. ప్రతిఒక్కరూ విద్యార్థిని ఆదర్శంగా తీసుకొని తమ ప్రతిభను ప్రదర్శించాలన్నారు. గతంలో కూడా బాసర శ్రీజ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయంలో (ఎస్ఎంఆర్) వాగ్దేవి సొసైటీ సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్న ప్రకాష్‌పనికి రాని వస్తువులతో ఇంటికి ఉపయోగపడే వంద రకాల అలంకార వస్తువులను తయారుచేసి వావ్ అనిపించుకున్నాడు.

బాక్సింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి డి. భోజన్న

నిర్మల్ రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జోనల్ స్థాయి బాక్సింగ్ అండర్- 17 బాల బాలికల క్రీడా ఎంపిక పోటీలు బుధవారం ఎన్టీఆర్ మినీ స్టేడియం నందు నిర్వహించడం జరిగింది. ఈ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టును ఎంపిక చేయడం జరిగింది. ఈ ఎంపికైన క్రీడాకారులు హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రవీందర్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి డి. భోజన్న, డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో క ఓచ్‌లు ఎం. శేఖర్, రాజేష్, సీహెచ్, స్వామి, క్రీడల కన్వీనర్ ఎన్. సత్తయ్య పీడీ, మంజులాపూర్, భూమన్న పీడీ కస్బా, కిషోర్ ఎన్ఎస్ఏ, శివానంద్, శ్రీధర్ వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.

హిందువుల ఐక్యతకు కృషి

నిర్మల్ రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : హిందువుల ఐక్యతకు పంచ పరివర్తన్ ద్వారా ఆర్ఎస్ఎస్ కృషి చేస్తుందని సామాజిక సద్భావన జిల్లా ప్రముఖ్ రాజులదేవి గోవర్ధన్ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాలలో భాగంగా ఆర్ఎస్ఎస్ విశ్వనాథ్‌పేట్ బస్తీ ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ మందిర్‌లో విజయదశమి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానవక్త రాజులదేవి గోవర్ధన్ (సామాజిక సద్భావన జిల్లా ప్రముఖ్) ప్రసంగించారు. 1925లో ప్రారంభమై దేశ వ్యాప్తంగా విస్తృత శాఖలతో, వివిధ రంగాల్లో దేశభక్తిపూరిత, హిందుత్వ ఆధారసంస్థలతో ప్రపంచంలోని అనేక దేశాలలో పని చేస్తుందని చెప్పారు. ఆర్ఎస్ఎస్ జన్మ శతాబ్దిలో భాగంగా రాబోయే రోజుల్లో ఇంటింటి జనజాగరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర కార్యవాహ కిన్నెర్ల రవి, నగర సహ వ్యవస్థ ప్రముఖ్ సుదర్శన్ చారి, ధీరజ్, రాజు, నర్సయ్య, దేవేందర్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యను అందించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్


మాట్లాడుతున్న అదనపుకలెక్టర్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన విద్యను అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యుతో పాటు నాణ్యమైన వసతులు కల్పించాలన్నారు.

నామినేషన్లపై అప్రమత్తంగా ఉండాలి

మామడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నామినేషన్లు స్వీకరించేటప్పుడు ఎటువంటి తప్పులు దొర్లకుండా రిటర్నింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన మామడ మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ నెల 9 నుంచి జరిగే జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

సుర్జాపూర్‌లో రితేష్ రాథోడ్ ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న రితేష్ రాథోడ్

ఖానాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో గల అతి పురాతనమైన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి రథోత్సవం, పల్లకి సేవలో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన రితేష్ రాథోడ్‌ను ఆలయ కమిటీ బృందం ఘనంగా సన్మానించింది. ఆయన వెంట స్థానిక బీజేపీ నాయకులున్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ



మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 47 మద్యం దుకాణాలకు 2025-2027 దరఖాస్తులు దాఖలు చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి అబ్దుల్ రజాక్ తెలిపారు. ఈ సందర్భంగా దరఖాస్తుదదారులు సమాచార నిమిత్తం సమాచార కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దరఖాస్తులను అక్టోబరు 18 వరకు స్వీకరణకు గడువు ఉందన్నారు. అక్టోబరు 23న మద్యం దుకాణాల దరఖాస్తులను లాటరీపద్ధతిలో డ్రా ద్వారా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక చేస్తారని తెలిపారు. ప్రతి దరఖాస్తుకు ఆధార్ కార్డు, పాన్ కార్డు, మూడుకలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జత చేయాలి. ప్రతి దరఖాస్తు వెంబడి రూ. 3,00,000లు దరఖాస్తు రుసుముగా నాన్ రిఫండబుల్ ఫీ చెల్లించాలి. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైన వేయడానికి అవకాశం ఉంటుంది. ఒకరు ఎన్ని మద్యం దుకాణాలకైనా దరఖాస్తులను వేయడానికి అవకాశం కల్పించారు. డీడీ, చలాన్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి పేరున తీయాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు ఫారాలను జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి నిర్మల్, 2వ అంతస్తు, రూ. నెంబర్ 13లోని ఐడీఓసీ కలెక్టరేట్, నిర్మల్‌లో దాఖలు చేయాలని ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి ఈ ఫోన్ నెంబర్లకు 8712658774, 8712658790, 8712658791లకు సంప్రదించాలని తెలిపారు.

కనుల పండువగా శారదా దేవి విగ్రహ నిమజ్జనోత్సవం


నిమజ్జన శోభాయాత్రలో ఆర్యవైశ్య సంఘం మహిళలు

భైంసా, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బుధవారం శారదా దేవి విగ్రహాల నిమజ్జనోత్సవ వేడుకలు కనుల పండువగా కొనసాగింది. మధ్యాహ్నం వేళలో ప్రారంభమైన నిమజ్జనోత్సవ శోభాయాత్ర సాయంత్ర వేళలో ముగిసింది. ఆర్యవైశ్య మహిళా మండలి, బ్రాహ్మణ సమాజ్ మహిళా మం డలి ప్రతినిధులు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం శోభాయాత్ర ద్వారా నిమజ్జనానికి శారదాదేవికి విగ్రహాన్ని తరలించారు. శోభాయాత్రలో సభ్యులు గేయాలు ఆలపిస్తూ, కోలాటాలే వేస్తూ వేడుకకు వన్నెతెచ్చారు. పలువురు మహిళలు మంగళహారతులతో శోభాయాత్రలో పాల్గొన్నారు. శారదాదేవి విగ్రహానికి గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కడెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల ప్రజలు ఎప్పుడు జాగ్రత్తగా ఉండాలని కడెం పోలీసులు సూచించారు. ఎస్సై సాయికిరణ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత సమాచారం ఓటీపీలను ఎవరికీ తెలియజేయవద్దని కోరారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది విశాల్, సాయి ప్రసాద్, డబ్ల్యూపీసీ రజిత, ఆకాంక్ష, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహిస్తున్న దృశ్యం

సారంగాపూర్ , అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సారంగాపూర్ మండలంలో గల స్వర్ణ ఆశ్రమపాఠశాలలో బుధవారం వన్యప్రాణుల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ, ఆధ్వర్యంలో అధికారులు నీజీర్‌ఖాన్, అనూషలు విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ వన్యప్రాణులను రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిది అని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో వన్య ప్రాణులను వివరించారు. అనంతరం వణ్యప్రాణులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, అటవీశాఖ అధికారులు ఉన్నారు.

ఉర్దూ పాఠశాల ఆవరణలో పాముల గుబులు

నర్సాపూర్(జి), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఉర్దూ ఉన్నత ప్రాథమిక పాఠశాల ఆవరణ భద్రతకు దూరమైంది. ప్రాంగణంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోవడంతో విద్యార్థులు విషసర్పాల భయంతో వణికిపోతున్నారు. బుధవారం మధ్యాహ్నం ఏకంగా పాము పాఠశాల ఆవరణలోకి ప్రవేశించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్రఆందోళన వ్యక్తం చేశారు. డైనింగ్ హాల్ బిల్లు విషయంలోనూ గతంలో కాంట్రాక్టర్ తాళం వేయడం వంటి సంఘటనలు అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు ఆరోపిస్తున్నారు. పిల్లల భద్రత కోసం తక్షణమే పాఠశాల ఆవరణను శుభ్రం చేయించి, పిచ్చి మొక్కలను తొలగించాలని తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులను, స్థానిక పంచాయతీ సిబ్బందిని డిమాండ్ చేస్తున్నారు.

ఎద్దుకు అంత్యక్రియలు

కుంటాల, అక్టోబర్, 8 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓలా గ్రామానికి చెందిన సిందే సదాశివ్ పటేల్ అనే రైతుకు చెందిన ఎద్దు మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందడంతో బుధవారం సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. 20 సంవత్సరాలుగా తనకు వ్యవసాయంలో తోడుగా ఉంటూ తనకు మేలు చేసిన ఎద్దుకు అంత్యక్రియలు నిర్వహించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను బుట్ట దాఖలు చేసింది

● ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యులు డాక్టర్ పడకంటి రమాదేవి


కాంగ్రెస్ బాకీకార్డులతో బీఆర్ఎస్ నాయకులు

ముథోల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : రేవంత్ రెడ్డి సర్కారు మాయమాటలు చెప్పి అధికారాన్ని కైవసం చేసుకుని 420 హామీలను బుట్టదాఖలు చేసిందని ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యులు డాక్టర్ పడకంటి రమాదేవి అన్నారు. ముథోల్ మండలంలోని తరోడా గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డ్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలుపరచడంలో విఫలమైందని అన్నారు. స్థానిక ఎన్నికల్లో ఈ విషయాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇంటింటికి వెళ్లి అందరికీ తెలియజేసేలా కార్యకర్తలు ముందుకెళ్లాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ముథోల్ నియోజకవర్గంలో అధిక శాతంలో గెలుపొంది సత్తా చాటాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గంగాధర్, నాయకులు అశోక్, ఎస్‌కే. బాబు, గణపతి, భూమారెడ్డి, గంగారెడ్డి, విఠల్, సాయి, శంకర్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు


పరామర్శిస్తున్న దృశ్యం

లోకేశ్వరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంలో బుధవారం మామిడి పేపశ్వర్, లక్ష్మణ్‌ల తల్లి గంగవ్వ చనిపోయిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు జడ్పీ మాజీచైర్మన్ లోలం శ్యామ్‌సుందర్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరిపే శ్యామ్‌సుందర్ వారిని పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట బీఆర్ఎస్ మండల సోషల్ మీడియా అధ్యక్షులు బండి ప్రశాంత్, అనిల్, సందీప్, నందు పటేల్, సాయినాథ్‌లు ఉన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం'

కుంటాల, అక్టోబరు, 8 : (ఆంధ్రజ్యోతి) :కాం గ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. ప్రజలకు ఇప్పటి వరకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను బాకీకార్డుల రూపంలో కుంటాలలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. గతంలో పెన్షన్ పెంచుతామని చెప్పి పెంచకపోవడంతో నెలకు రూ.1000 చొప్పున 22 నెలలకు 22 వేలు బాకీ అయిందని, కల్యాణలక్ష్మీ పథకం ద్వారా తులం బంగారం చెల్లిస్తామని చెప్పి ఇది వరకు చెల్లించడం లేదన్నారు. వికలాంగులు, వృద్ధులకు పెన్షన్ పెంచుతామని చెప్పి ఇప్పటి వరకు పెంచలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

అందరి ఆప్త బంధువు

● నేడు ప్రపంచ తపాలా శాఖ దినోత్సవం

ముథోల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక సాంకేతిక యుగంలోనూ ప్రజల హృదయాలకు చేరే తపాలా శాఖ సేవలు తమ ప్రత్యేకగుర్తింపు నింపుకుంటున్నాయి. సందేశాల మార్పిడి నుంచి ప్రభుత్వ పథకాల అమలు వరకు తపాలా వ్యవస్థ ఇప్పుడు ఇక బహుముఖ సేవసారథి పరిణమించింది. ప్రతి సంవత్సరం అక్టోబరు 9న జరుపుకునే ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా తపాలా శాఖలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. దీనిపైప్రత్యేక కథనం.. 1874లో స్విట్జర్లాండ్‌లోని బెర్న్‌లో యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (యూపీయూ) స్థాపనకు గుర్తుగా ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. తపాలా శాఖ సేవలు పరిణామం ఒకప్పుడు లేఖల ద్వారా ప్రేమ, అనురాగం, సమాచారం పంచుకునే తపాలా సేవా ఇప్పుడు డిజిటల్ పోస్ట్ ఆఫీస్, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ), ఈ-కామర్స్ డెలివరీలు, ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్, ఆధార్ సేవలు వంటి విభాగాలతో ఆధునిక రూపం సంతరించుకున్నాయి. తపాలా శాఖ ఇప్పుడు కేవలం లేఖలు, పార్శిళ్ల పంపిణీకే పరిమితం కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగస్వామిగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో తపాలా మిత్రులు బ్యాంకింగ్, పెన్షన్ పంపిణీ, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు డబ్బులు అందజేయడం వంటి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ప్రపంచ వ్యాప్తం - ఒకే లక్ష్యం...

ప్రపంచ వ్యాప్తంగా 192 దేశాలు సభ్యులుగా ఉన్న యూనివర్సల్ పోస్టల్ యూనియన్ ద్వారా, అంతర్జాతీయ స్థాయిలో తపాలా సేవల సమన్వయం కొనసాగుతోంది. లేఖలు, పార్శిళ్లు, మనీ ఆర్డర్లు సురక్షితంగా, వేగంగా గమ్యస్థానాలకు చేరేలా ఈ సంస్థ కీలకపాత్ర పోషిస్తోంది. తెలియకుండానే చేరుకునే, వర్షం, ఎండ లెక్క చేయని తపాలా సిబ్బంది సేవలు ప్రజలకు అపారమైనవి. ఈ రోజు వారిని స్మరించుకుంటూ, దేశవ్యాప్తంగా తపాలా కార్యాలయాల్లో అవార్డులు, సదస్సులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


ముథోల్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయం

తపాలా శాఖ సాంకేతికతతో సాన్నిహిత్యం...

డిజిటల్ ఇండియాలో డిజిటల్‌పోస్టు, స్మార్ట్ ఇండియా దిశగా వేగంగా పయనిస్తున్న దేశంలో తపాలా శాఖ కూడా కొత్త అడుగులు వేస్తోంది. ఇప్పుడు ప్రతి తపాలా శాఖ కార్యాలయం కంప్యూటరైజ్డ్ అయింది. పార్శిల్ ట్రాకింగ్, ఆన్‌లైన్ మనీట్రాన్స్‌ఫర్, ఈ-పోస్ట్, డిజిటల్ సేవలు - ఇవన్నీ ఇప్పుడు ప్రజల తలుపు దగ్గరే లభిస్తున్నాయి. ఇండియా పోస్ట్‌పేమెంట్స్ బ్యాంక్ ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలు నగరాల మాదిరిగా డిజిటల్ లావాదేవీలు చేస్తున్నారు. రిమోట్ గ్రామాల్లో బ్యాంక్ బ్రాంచ్ లేకపోయినా, తపాలా సిబ్బంది వద్ద ఫింగర్ ప్రింట్‌తోనే డబ్బులు అందుకుంటున్నారు.

విప్లవాత్మక మార్పు...

ప్రతి ప్రభుత్వ పథకం ప్రజల చెంతకు చేరేలోపు దానికి సజీవ మాధ్యమం తపాలా శాఖే చెప్పుకోవచ్చు. పీఎం కిసాన్, పెన్షన్ పథకాలు, జన్ ధన్ యోజన... ఇలాంటి పథకాల లబ్ధిదారులకు తపాలాశాఖ సిబ్బంది ద్వారానే నేరుగా నగదు, పత్రాలు చేరుతున్నాయి. వృద్ధులు, వికలాంగులు బ్యాంక్‌కి వెళ్లలేని సమయంలో 'తపాలా సిబ్బంది' ఇంటికే వచ్చి డబ్బు అందజేయడం జరుగుతుంది. తపాలా శాఖ ఇండియా పోస్ట్ఇప్పుడు గ్రీన్ ఎన్విరాన్‌మెంట్, ఎలక్ట్రిక్ వాహనాల డెలివరీ, సస్టెయినబుల్ పోస్టల్ సిస్టమ్స్ దిశగా అడుగులు వేస్తోంది.

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో...

ఆదిలాబాద్ ఉమ్మడిజిల్లాలో 2హెడ్ పోస్ట్ ఆఫీస్‌లు, 62 సబ్‌డివిజన్ పోస్టుఆఫీస్‌లు, 519 బ్రాంచ్‌లు సుమారు 11 వందలకు పైగా సిబ్బంది ఉన్నారు. ఇప్పుడు రిజిస్టర్ పోస్ట్ సేవలు రద్దు కావడవంతో అక్టోబరు 1 నుండి స్పీడ్ పోస్ట్ సేవలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. నాడు టెలిగ్రామ్‌లు, ఉత్తరాలు, రాఖీలు తదితర వాటికి పరిమితమైన ఈ తపాలా సేవలు ప్రముఖ భూమిక పోషిస్తుందని చెప్పుకోవచ్చు.

నాణ్యమైన సేవలు అందించడమే మా లక్ష్యం...



తపాలా శాఖ ద్వారా ప్రతి వ్యక్తికి నాణ్యమైన సేవలు అందించాలన్న దృఢసంకల్పమే మా ధ్యేయం. సేవింగ్స్ బ్యాంక్ పథకం, రికరింగ్ బ్యాంక్ పథకం, సుకన్య సమృద్ధి యోజన పథకం, డిపాజిట్ పథకం, పబ్లిక్ ప్రావిడెంట్ పథకం , నెలవారీ వడ్డీ పథకం, సీనియర్ సిటిజన్ సేవింగ్ పకథం, నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్ పథకం, కిసాన్ వికాస్ పత్ర పథకంతో పాటు అన్ని విధాలా సర్వీస్‌ను అందిస్తాం. నమ్మకమైన సేవలు అందించడమే తపాలా శాఖ అభిమతం.

● బి. గంగయ్య, ఎస్‌పీఎం, ముథోల్

మద్దతు ధర లేక రైతులకు నిరాశ

కుభీర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పంట దిగుబడులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు కాగితాలకే పరిమితమయ్యాయి. 2025-26 సంవత్సరానికి పెంచిన మద్దతు ధరలు ఈ నెల ఒకటి నుంచి అమల్లోకి వచ్చాయి. మండలంలో ప్రస్తుతం సోయాబీన్, మొక్కజొన్న పత్తి , కంది, పసుపు తదితర పంటలు సాగు చేశారు. కాగా కుభీర్ వ్యవసాయ మార్కెట్‌కు వారం రోజులుగా సోయాబీన్ వస్తోంది. ఇక్కడ ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆశగా ఎదురు చూస్తు, పంట దిగుబడులను ఆరబెడుతున్నారు. బయట మార్కెట్‌లో విక్రయిస్తే రైతులు ఆశించిన ధర లభించడం లేదు. దళారులకు విక్రయించడానికి వెళ్లే రైతుల నుంచి హమాలి, కట్టి అధికతేమ, నాణ్యత లోపం పేరిట దోచుకుంటున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. సోయాబీన్ క్వింటాలు రూ.5,328 ప్రభుత్వం మద్ధతు ధర ప్రకటించిన దళారులు రూ.4,050, పత్తి రూ. 8,110కు గాను కేవలం 7100లకు కొనుగోలు చేస్తున్నారని వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.


కుభీర్ వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన సోయాబీన్

కుంటాల కాంగ్రెస్ జడ్పీటీసీ టికెట్‌కు తీవ్ర పోటీ

కుంటాల, అక్టోబర్, 8 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండల కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ టికెట్ కోసం తీవ్ర పోటీనెలకొంది. ఇతర ప్రధాన పార్టీలతో పోల్చితే అధికార కాంగ్రెస్ పార్టీలో తీవ్రపోటీ నెలకొందని చెప్పవచ్చు. నియోజకవర్గ ఇన్‌చార్జీలు అయిన నారాయణ రావు పటేల్, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి వర్గీయులు కుంటాల జడ్పీటీసీ టిక్కెట్ దక్కించుకోవడానికి తీవ్రంగా పోటీ పడుతున్నారు. కుంటాలకు చెందిన మాజీ ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ జుట్టు అశోక్, తాజా మాజీ జడ్పీటీసీ కొత్తపల్లి బుచ్చన్న, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు నాలం శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ ప్రకాష్‌గౌడ్ కుమారుడు సుకుమార్ గౌడ్, కల్లూరు మాజీ సర్పంచ్ రమణ గౌడ్, లింబా (కే) మాజీసర్పంచ్ ఆనంద్ రావు పటేల్ జడ్పీటీసీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇందులో నుంచి డీసీసీ స్థాయిలో కసరత్తు జరిపి గెలిచే అవకాశాలు ఉన్న ముగ్గురు వ్యక్తుల పేర్లను పార్టీ అధిష్టానానికి పంపనున్నారు. అధిష్టానానికి పంపే జాబితాలో ఆ ముగ్గురు వ్యక్తులు ఎవరుంటారో అందులో నుంచి ఎవరికి పార్టీ టిక్కెట్ దక్కుతుందో అన్నది పరిస్థితి ఉత్కంఠగా మారింది. న్యాయపరమైన చిక్కులు లేకుంటే ఒకట్రెండు రోజుల్లో అభ్యర్థుల ఎంపికపై స్పష్టత రానుంది.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు


ఆర్యవైశ్య సంఘంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నర్సాపూర్(జి), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మంగళవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో బతుకమ్మ పాటలు, నృత్యాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సరస్వతి, మాధవి, శ్వేత, ప్రశాంతి, వనజ, ఇంద్రజ, గంగామణి, వేదశ్రీ, తేజస్విని, ప్రణతి వంటి యువతులు ఆలపించిన బతుకమ్మ పాటలు, వారి నృత్య ప్రదర్శనలు పండుగ శోభను రెట్టింపు చేశాయి. వారి ప్రతిభ, పాటల మాధుర్యం అక్కడకు విచ్చేసిన ప్రజలందరినీ మంత్రముగ్ధులను చేసింది. ఈ 'ముత్యాలు' (యువతులు) అందరినీ అలరించి, పండుగ స్ఫూర్తిని పెంపొందించారు. ఆర్యవైశ్య సంఘం పెద్దలు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కృషి చేశారు.

'ఉపాధిహామీ కూలీలు ఈకేవైసీ చేసుకోవాలి'

తానూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో ఎస్ఆర్ఈజీఎస్ ఏపీవో శివలింగం ఉపాధిహామీ సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం తానూర్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న ఉపాధి హామి కూలీలకు స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రతి ఒక్కరికీ ఈ కేవైసీ చేయాలన్నారు. గ్రామాల్లో నాటిన ప్రతి మొక్క ను సంరక్షించాలన్నారు. ప్రతి ఒక కూలికి ఉపాధిహామీ పనులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు జితేందర్, రమణగౌడ్, గంగాధర్, ప్రసాద్, పోశెట్టి, ఫిల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

నిర్మల్ రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సంవత్సరం అక్టోబరు నెలలో రెండో గురువారం ప్రపంచ కంటిచూపు దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో ఎల్‌వీప్రసాద్ కంటి ఆసుపత్రి వారు నిర్వహించిన పాదయాత్రలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు పాల్గొన్నారు. ఈ దినోత్సవం సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ... ప్రజల్లో కంటిఆరోగ్యం గురించి అవగాహన కల్పించడం, కంటి పరీక్షల ప్రాముఖ్యతను గుర్తుచేయడం, అంధత్వం నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వారు జిల్లా కేంద్రంలోని ట్యాంక్‌బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం నుంచి పాదయాత్ర నిర్వహించడం చాలా మంచి విషయమన్నారు. కంటి ఆరోగ్యం గురించి ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నంలో భాగస్వామ్యులవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ దినోత్సవం ద్వారా ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలను నిర్లక్ష్యం చేయకుండా, సమయానికి చేయించుకోవాలని సూచించారు. ప్రజల్లో కంటి ఆరోగ్యంపై అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. సమయానుకూల కంటి పరీక్షలు చేయించుకోవాలని, కంటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మాజీ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, కాలగిరి గంగారెడ్డి, కొట్టే శేఖర్, రాజేశ్వర్, రాజేశ్వర్, ఎల్‌వీప్రసాద్ కంటి ఆసుపత్రి యాజమాన్యం పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నిర్మల్ రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను అణచి వేయాలని చూస్తోందని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ భూపాల్ అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు నిర్మల్ నియోజకవర్గంలోని దిలావర్‌పూర్, సారంగాపూర్, లక్ష్మణ చాంద, మామడ మండలంలో ఓటు చోరీపై కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్, నిర్మల్, సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు సోమ భీమ్ రెడ్డి, అబ్దుల్ హాది, మండల పార్టీ అధ్యక్షులు తక్కల విద్యాసాగర్ రెడ్డి, బొల్లోజీ నర్సయ్య, ఒడ్నాల రాజేశ్వర్ ఉన్నారు.

సారంగాపూర్ : మండలకేంద్రంతో పాటు బీరవెల్లి, స్వర్ణ గ్రామాలలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటు చోరీ సంతకాలు సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కూచడి శ్రీహరిరావు మాట్లాడుతూ బీజేపీ వేరే రాష్ట్రాలలో దొంగ ఓట్లను చెలామణి చేస్తూ ఓటు చోరీ చేస్తున్నది రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నిర్మల్, ముథోల్ నియోజక వర్గం ఇన్‌చార్జి రాంభూపాల్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఎంబడి రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లోజు నర్సయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న దృశ్యం

మామడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలకు పలువురు యువకులు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు అన్నారు. మండలం మొండిగుట్ట గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు 50 మందికి పైగా బుధవారం రోజున ఇస్లావత్ బాలాజీ (రిషి కుమార్), బి. రమేష్, ఉప్పరి భీమేష్‌ల ఆధ్వర్యంలో పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై శ్రీహరి రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరామన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులను డీసీసీ అధ్యక్షులు కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఎన్. శ్రీనివాస్, రాథోడ్ వసంత, బోడ సునీల్, దుంగవత్ విజయ్, బోడ గజానంద్, ఆడే ప్రహ్లాద్, బోడ రాజు, జాదవ్ కిరణ్, మండల కాంగ్రెస్ నాయకులు, మామడ మాజీ జడ్పీటీసీ సోనియా సంతోష్ పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ


పరామర్శిస్తున్న నారాయణ్‌రావుపాటిల్

తానూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెంబర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన పలువురు కార్యకర్తల కుటుంబాలను బుధవారం నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ్‌రావుపాటిల్ పరామర్శించారు. వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అధైర్యపడొద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈయన వెంట నాయకులు పుండ్లీక్, సదాశివపటేల్, పాండురంగ పటేల్, బాబు, కుంటాల మాజీ ఎంపీపీ భోజారాంపటేల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్ర, చంద్రకాంత్, మాజీ మీర్జాపూర్ సొసైటీ చైర్మన్ శ్యామ్‌రావు, తానూర్ మండల ఆత్మడైరెక్టర్ హనుంత్, తదితర నాయకులున్నారు.

ప్రయాణికులకు శాపంగా మారిన అతివేగం


ప్రమాదకరంగా బస్సును సైడ్ కొడుతున్న దృశ్యం

నర్సాపూర్(జి), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్ల నిర్లక్ష్య వైఖరి వల్ల ప్రయాణికుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉంది. నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో తాజాగా చోటుచేసుకున్న ఓ ఘటన డ్రైవర్ల బాధ్యతారాహిత్యాన్ని మరోసారి స్పష్టం చేసింది. నిర్మల్ నుంచి భైంసా వైపు వెళ్తున్న ఓ ఆర్టీసీ బస్సులో అధిక రద్దీ (ఓవర్ లోడ్) కారణంగా ప్రయాణికులు నిలబడటానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. అంతే కాకుండా, డ్రైవర్ బస్సు డోర్‌ను పూర్తిగా వేయకుండానే ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా బస్సును వేగంగా నడిపాడు. బస్సు కిక్కిరిసి ఉండటం, డోర్‌తెరిచి ఉండటంతో ప్రయాణికులు ఎక్కడ కింద పడిపోతామోనని తీవ్ర భయాందోళన వ్యక్తం చేశారు. డ్రైవర్ల ఈ నిర్లక్ష్య వైఖరి గతంలో జరిగిన ఓ ఘోరప్రమాదాన్ని స్థానికులకు గుర్తు చేసింది. ఇదే ప్రాంతంలో నర్సాపూర్‌ను ఆనుకుని రాంపూర్ వద్ద బస్సు దిగిన మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు మోడపు లక్ష్మీ, తిరిగి బస్సు ఎక్కే ప్రయత్నంలో ఉండగా డ్రైవర్ గమనించకుండా బస్సును నడపడంతో ఆమె బస్సు టైర్ కింద పడి మృతి చెందారు. ఇటువంటి ఘోర ఘటన జరిగినప్పటి డోర్ మూయకుండా బస్సు నడపడం, అతివేగం ప్రదర్శించడంపై స్థానికులు మండిపడుతున్నారు. ప్రయాణికుల భద్రత అనేది పూర్తిగా డ్రైవర్ బాధ్యత అని, ఈ తరహా ప్రాణాల మీదకు తెచ్చే నిర్లక్ష్యం వహించే డ్రైవర్లపై రవాణా అధికారులు, పోలీస్ శాఖ తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. డ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే ప్రయాణికులు క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేరుకోగలుగుతారని వారు నొక్కి చెప్పారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

తానూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల షెడ్యూల్ అమలులో ఉందని ప్రతి ఒక్కరు ఎన్నికల నియమవాళిని పాటించాలని ఎస్సై షేక్ జుబేర్ అన్నారు. మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో పర్యటించి స్థానిక ఎన్నికల నియామవళిపై తీసుకువచ్చేటప్పుడు పంటలకు సంబంధించిన రశీదులను వెంట ఉంచుకోవాలన్నారు. 50వేలకు పైగా డబ్బులు తీసుకువెళ్లవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

కష్టాల కడలిలో సోయా రైతులు

- చేతికొచ్చిన పంట దళారుల పాలు
- తక్కువ ధరకే అమ్ముకుంటున్న వైనం
- నిర్మల్ జిల్లాలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం తప్పని ఎదురుచూపులు

బాసర, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఒక వైపు అకాల వర్షాల తాకిడి.. మరోవైపు కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తీవ్ర జాప్యం... జిల్లాలో సోయాబీన్ రైతులు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. అన్ని ఆటంకాలు దాటి చేతికొచ్చిన పంటను అమ్ముకోవడానికి మార్గం లేక, ఆందోళనతో గడుపుతున్నారు. ఇప్పటికే పలుమార్లు వరదలు, అధిక వర్షాలతో దిగుబడి కోల్పోయిన పలుమార్లు వరదలు, అధిక వర్షాలతో దిగుబడి కోల్పోయిన రైతన్నలు, ఇప్పుడు కోసిన పంటను కాపాడుకోలేక తక్కువ ధరకే దళారుల చేతుల్లో నిలువు దోపిడికి గురవుతున్నారు.



సోయాబీన్ జల్లెడ పడుతున్న రైతులు

ధాన్యం కుప్పలు వర్షార్పణం

ప్రస్తుతం జిల్లాలో సోయాబీన్ పంట కోతలు జోరుగా సాగుతున్నాయి. ఎక్కడ చూసినా కోసి, ఆరబెట్టిన ధాన్యం కుప్పలు దర్శనమిస్తున్నాయి. అయితే, గత నాలుగు, అయిదు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలు రైతులను తీవ్రంగా కలవర పెడుతున్నాయి. ఆరుబయట ఉన్న సోయాబీన్ తడిసి, రంగు మారి, నాణ్యత దెబ్బతింటోంది, కోసిన పంటను రక్షించుకోలేక రైతులు నిస్సహాయ స్థితిలో ఉన్నారు.

దళారులకు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు

: ఆనంద్ బండారి, బీకేఎస్ రైతు సంఘం నాయకులు, బాసర



చేతికి అందిన పంటను ఇంకెన్ని రోజులు కాపాడుకోవాలి. వర్షాలకు పంట అంతా తడిసి పోతోంది. పంట చేతికి అందిన తర్వాత కూడా ఆరబెట్టడానికి అదనపు ఖర్చులు భరించాల్సి వస్తుంది. కొనుగోలు కేంద్రాలు తెరవ, మరో దారి లేక, దళారుల చేతుల్లో తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి వచ్చింది. మద్దతు ధర ప్రకటించినప్పటికీ కొనుగోలు కేంద్రాల లేకుంటే అర్థమేముంది.? నెల రోజుల క్రిందట జిల్లా ఇన్‌చార్జి మంత్రికి విన్నవించాం. ఏం లాభం లేదు. ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

కొనుగోలులో తీవ్ర జాప్యం

పంట కోతలు ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నా, నేటికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయక పోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రతిసారి రైతులంతా పంట అమ్ముకున్న తర్వాత చివరి దశలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం దక్కడం లేదు. ఈ సారి కూఆడా ఇదే తంతు కొనసాగుతుండడంతో, తడిసిన పంటను, నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్న పంటను కాపాడుకోలేక రైతులు మరోమార్గం లేక దళారులకు విక్రయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. సిండికేట్‌గా మారిన దళారులు మార్కెట్ ధర కంటే చాలా తక్కువ ధరకే సోయాబీన్‌ను కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారు. అంతేకాకుండా ప్రకృతి వైపరీత్యాలతో ఇప్పటికే నష్టపోయిన రైతన్నలకు ఈ దళారులు దోపిడీ... రైతులకు పుండు మీద కారం చల్లినట్లు తయారైందంటున్నారు.

మంత్రి దృష్టికి తీసుకెళ్లినా.. ఫలితం శూన్యం

ఈ నెల మొదటి వారంలో జిల్లాలో పర్యటించిన జిల్లా ఇంచార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు గారికి రైతులు, రైతు సంఘాల నాయకులు కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జరుగుతున్న జాప్యాన్ని వివరించారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని విన్నవించారు. అయితే విన్నపం చేసి నెల రోజులు గడుస్తున్నా.. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు విషయంలో ఎలాంటి చర్యలు కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు ఈ విషయాన్ని తేలికగా తీసుకుంటున్నారనే ఆందోళన రైతుల్లో నెలకొంది.



ఇన్‌చార్జీ మంత్రి జూపల్లికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు(ఫైల్)

ఇప్పటికైనా మేల్కొంటారా?

అధిక వర్షాలు, గోదావరి వరదల వల్ల ఇప్పటికే మూడుసార్లు పంట మునిగి నష్టపోయిన రైతులు, ఇప్పుడు కోసిన పంటను అమ్ముకోవాడానికి మార్గం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దళారుల చేతుల్లో తక్కువ ధరకే అమ్ముకొని నిలువు దోపిడికి గురవకుండా ఉండాలంటే, ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. కష్టకాలంలో రైతున్నకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అకాల వర్షాలు తెస్తున్న నష్టాన్ని నివారించడానికి, దళారులు దోపిడిని అరికట్టడానికి తక్షణమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు మద్ధతు ధర కల్పించాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



తలమడుగు మండలంలో అమ్మేందుకు ఆరబోసిన సోయలు

సోయాపై ఆశలు.. ఆవిరి!

(5వ పేజీ తరువాయి...)

కొనుగోలు చేస్తున్నారు. అయినా.. గత్యంతరం లేక రైతులు ఆదరబాదరగా పంటను అమ్మేసుకుంటున్నారు. ఒక్కో క్వింటాల్ వెంట వెయ్యి రూపాయల వరకు దండుకుంటున్నారు. నాణ్యత లేదన్న సాకుతో ధరలో భారీగా కోతను విధిస్తున్నారు. నాణ్యత, తూకంలో మోసం, ధరల్లో కోతలు పెడుతూ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పంట డబ్బులను నగదుగా చెల్లిస్తున్నామం టూ కోతలు విధిస్తున్నారు. ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా.. దళారి దందానే కనిపిస్తుంది.



మొలకెత్తిన సోయా పంటను చూపుతున్న రైతు

సీజేఐపై దాడి పట్ల దళిత సంఘాల ఖండన

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని దళిత సంఘాల నేతలు పేర్కొన్నారు. జిల్లా దళిత సంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేద్కర్ భవన్ లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై, రాజ్యాంగంపై, న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా బావిస్తున్నామని, దాడికి పాల్పడిన లాయర్‌ను వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీవ్ర ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్యాల స్వామి, మోతే బారిక్ రావు, మల్యాల మనోజ్, నక్క రాందాస్, భీంరావ్ వాగ్మారే, లింగంపల్లి ప్రసన్నకుమార్, కత్తి గంగాధర్, రవికుమార్, మహేష్ పాల్గొన్నారు.

● ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన

ఆదిలాబాద్ టౌన్: భారత ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని దళిత సంఘాల నాయకులు ప్రజ్ఞ కుమార్ అన్నారు. సీజేఐపై జరిగిన దాడికి నిరసనగా బుధవారం ఆదిలాబాద్ అంబేద్కర్ చౌక్ వద్ద ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీజేఐ పై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. రాజ్యాంగ దాడిగా పరిగణించి అతనిని దేశద్రోహిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

న్యాయమూర్తిపై దాడి అమానుషం

బోథ్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి జరగడం అమానుషమని దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని బోథ్ భారత్ అసోసియేషన్ అధ్యక్షులు వామన్ రావు దేశ్పాండే విమర్శించారు. న్యాయవ్యవస్థను ప్రతి ఒక్కరు గౌరవించాల్సిందేనని, అయితే కొంతమంది న్యాయవాదులపై దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఇటువంటి సంఘటనలు న్యాయవ్యవస్థ పై దాడి జరిగినట్లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పంద్రం శంకర్, అంగదు కేంద్ర రూపేందర్ సింగ్, ఆడెపు హరీష్, జమీర్, కేంద్రీ రాజు, గంగాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం



పట్టుబడిన కలపతో అటవీ శాఖ అధికారులు



సిరికొండలో పట్టుబడిన కలపతో అటవీ శాఖ అధికారులు

కలప అక్రమంగా రవాణా చేస్తే చర్యలు

సిరికొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సిరిచెల్మ కవ్వాల్ పులుల అభయారణ్యం పరిధి నుంచి అక్రమంగా కలప, ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిరికొండ ఫారెస్టు సెక్షన్ అధికారి చంద్రారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం సిరికొండ మండలం కేంద్రంలో పలువురి ఇళ్లలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను పట్టుకున్నారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.23 వేల విలువ గల కలపను స్వాధీనం చేసుకుని, అటవీశాఖ కార్యాలయానికి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా అడవులను నరుకుతూ అక్రమంగా కలప, ఇసుకను తరలిస్తే అట్టి వారిపై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఆయన వెంట వాయిపేట్ ఫారెస్టు సెక్షన్ అధికారి సత్తయ్య, బీట్ అధికారులు ఆడే సంతోష్, భీంజీ నాయక్, హీరాలాల్, ప్రవళిక, బేస్ క్యాంప్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పూజ చేసి వచ్చేలోపు బైక్ చోరీ

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): తాంసి మండలం కప్పర్ల గ్రామానికి చెందిన అరుణ్ ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు వన్ టౌన్ సీఐ బి.సునీల్ కుమార్ తెలిపారు. పట్టణంలోని రవీంద్రనగర్‌లో తన యజమాని ఇంటి ముందు 31 ఆగస్టు 2025న మధ్యాహ్నం 3 గంటలకు పార్కింగ్ చేసి మహాలక్ష్మి పూజకు వెళ్లాడు. అయితే, ఆయన తిరిగి 4 గంటలకు వచ్చి చూసేసరికి వాహనం కన్పించలేదు. బుధవారం ఈ విషయమై దరఖాస్తు ఇవ్వగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

అత్యాచార ఘటనలో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): 2023 నవంబరు 8న పత్తి పంట చేనులో పత్తి ఏరడానికి వెళ్లిన మహిళపై అత్యాచారానికి పాల్పడ్డ ఘటనలో నిందితుడు గుర్నులే నగేష్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ జిల్లా న్యాయాధికారి ప్రభాకర్ రావు తీర్పు వెలువరించారు. లైజన్ అధికారి గంగసింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. అత్యాచార ఘటనపై బాధిత మహిళ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై డి.రాధిక కేసు నమోదు చేశారు. అప్పటి సీఐలు నరేష్ కుమార్, సాయినాథ్‌లు విచారణ పూర్తి చేసి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టు డ్యూటీ అధికారి ఎం.ఎ. జమీర్ పది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, పీపీ ఏఏ రహీం సాక్షులను విచారించి కోర్టులో నేరం రుజువు చేశారు. కేసులో నేరస్తునికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా న్యాయాధికారి తీర్పు వెలువరించారు. నేరస్తునికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి గంజాయి ప్యాకెట్లను తీసుకొని ఆదిలాబాద్‌లో అమ్ముతున్న బొక్కల గూడకు చెందిన మహమ్మద్ ఓవెస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ బి.సునీల్ కుమార్ తెలిపారు. గంజాయి ప్యాకెట్లను తీసుకొని వచ్చి ఆదిలాబాద్‌లో అమాయక ప్రజలకు ఎక్కువ ధరకు అమ్ముకుంటూ ఉండగా బుధవారం సాత్నాల గెస్ట్ హౌస్ వద్ద పట్టుకోవడం జరిగిందన్నారు. అతని వద్ద ఒక సెల్ ఫోన్, 15 గ్రాముల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

'రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలి'

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇస్లాం మతంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని ఎంఐఎం పట్టణ అధ్యక్షులు నజీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ ను కలిసి వినతి పత్రం అందించారు. ఇటీవల జరిగిన దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలను నేతలు తీవ్రంగా ఖండించారు.

ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు నాణ్యమైన సేవలు

● ఆర్టీసీ ఆదిలాబాద్ ఆర్ఎం భవానీ ప్రసాద్

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ద్వారా అందిస్తున్న సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం భవాని ప్రసాద్ సూచించారు. దసరా పండగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన లక్కీ డ్రా లో భాగంగా బుధవారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ ఆరవ తేదీ వరకు ఆర్టీసీలో ప్రయాణించిన వారి టికెట్ల వెనకాల ఫోన్ నంబర్, పేరు రాసి లక్కీ డ్రా బాక్స్‌లో వేయగా... వాటి నుంచి లక్కీ డ్రా తీశారు. కార్యక్రమ అతిథులుగా ఎంవీఐలు శ్రీనివాస్, రవీందర్ లు హాజరై డ్రా తీయగా... ముగ్గురు విజేతలను ప్రకటించారు. దసరా స్పెషల్ లక్కీ డ్రాలో భాగంగా ఎంపికైన విజేతలకు త్వరలో హైదరాబాద్ లో జరగబోయే కార్యక్రమంలో బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ప్రయానికులకు ఆర్టీసీ ద్వార అత్యంత నాణ్యమైన సేవలను అందిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకుంటూ సంస్థను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్.ఎం శ్రీ హర్ష, రామయ్య, సీఐ రాజశేఖర్, ఎం.ఎఫ్ శ్రీకర్, ఎస్.ఎం పోశెట్టి, రిజర్వేషన్ ఇన్‌చార్జి హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

● ఆర్టీసీకి దసరా పండుగ ధమాకా

ఆదిలాబాద్ టౌన్: దసరా పండగ సందర్భంగా ఆర్టీసీకి లాభాల పంట పండింది. సుదూర ప్రాంతాల్లో ఉంటున్నవారు పండగకు తమ స్వగ్రామాలకు తిరిగి రావడంతో బస్సులకు గిరాకీ పెరిగింది. ప్రయాణికులు ఆర్టీసీ బస్సులవైపు మొగ్గు చూపడం ఆదిలాబాద్ రీజియన్‌కు కలిసి వచ్చింది. సెప్టెంబరు 9వ తేదీ నుంచి అక్టోబరు 6వరకు రీజియన్ పరిధిలో రూ.24 కోట్ల 11 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆర్ఎం భవాని ప్రసాద్ తెలిపారు. దసరాను పురస్కరించుకుని 599 అదనపు బస్సులు నడిపామని, వాటి ద్వారా రూ.కోటి 85 లక్షల 5 వేల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. ఉద్యోగులందరి సమష్టి కృషితోపాటు.. సంస్థను ప్రజలు ఆదరించడంతోనే మంచి ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు. భవిష్యత్తులోనూ ఆర్టీసీని ఆదరించి సంస్థ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.



లక్కీ డ్రాలో విజేతలను ప్రకటిస్తున్న అధికారులు

మంత్రి క్షమాపణలు చెప్పకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన

ఉట్నూర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వెనుకబడిన తరగతుల రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ ఎస్టీ మైనార్టీ సెల్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను దూషించి మాట్లాడినందుకు వెంటనే క్షమాపణలు చెప్పకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేయాల్సి వస్తుందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కాంబ్లె బాలాజి మాదిగ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగ సామాజిక వర్గానికి చెందిన లక్ష్మణ్‌కుమార్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన మంత్రి ప్రభాకర్ వైఖరి ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి ఆహంపూర్త వ్యాఖ్యల వల్ల దళితులు బలహీన వర్గాల మధ్య అవంతరాలు ఏర్పడతాయన్నారు. మంత్రి మాట్లాడుతున్న సమయంలో దళిత మంత్రి గడ్డంవివేక్ వెంకటస్వామి అక్కడే ఉన్నప్పటికి ఖండించక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా పొన్నం ప్రభాకర్ తన తప్పును తెలుసుకుని వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ ఉట్నూర్ మండల ఇన్‌చార్జీ అధ్యక్షుడు దాసరి రాంప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పులేటిశ్రీనుమాదిగ, ఇంద్రవెల్లి మండల అధ్యక్షుడు అందరి బాలాజి మాదిగలు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాంబ్లె బాలాజీ

'ఇళ్లు నిర్మించుకున్నాం.. బిల్లులు చెల్లించండి'

● ఎంపీడీవో కార్యాలయానికి తరలివచ్చిన లబ్ధిదారులు

బోథ్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తాము ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిన మొదట్లో బిల్లులు వచ్చాయి.. రెండవ బిల్లు రావాల్సి ఉంది.. అయితే ఆన్‌లైన్‌లో తమ పేర్లు గల్లంతు కావడంతో బిల్లులు రావడంలేదని మండలంలోని కుచ్చులాపూర్ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు ఎస్. గోదావరి మాకు నూరి జ్యోతి లక్ష్మి తదితరులు వాపోయారు. గ్రామ కార్యదర్శి మీ పేర్లు జాబితాలోనే గల్లంతు అయ్యాయని, తమ గ్రామ కార్యదర్శి అశోక్ పేర్కొన్నాడని వారు తెలిపారు. అయితే తాము వాస్తవ విషయం తెలుసుకునేందుకు ఎంపీడీవో కార్యాలయానికి రావడం జరిగిందని లబ్ధిదారులు పేర్కొన్నారు. తమ గ్రామం నుంచి దాదాపు 17 మంది లబ్ధిదారుల పేర్లు ఆన్‌లైన్ లేవని వారు వాపోయారు. మొదట ఒకటి, రెండు బిల్లులు వేసి ఇప్పుడు పేర్లు కనిపించడం లేదు. అంటే తాము ఏం చేయాలని ఎంపీడీవో రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎంపీడీవో జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడారు. సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని లబ్ధిదారులకు వివరించారు. కాగా లబ్ధిదారులు అప్పు చేసి ఇళ్ల నిర్మాణం చేసుకున్నామని, ప్రభుత్వం నుంచి బిల్లులు సత్వరమే అందేలా చూడాలని కోరుతున్నారు.



కార్యాలయం ఎదుట బైఠాయించిన ఇందిరమ్మ లబ్ధిదారులు

కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన

బోథ్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పత్తి పంటను విక్రయించుకునేందుకు నూతనంగా ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్‌పైన అవగాహన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పత్తి అమ్ముకోవాలంటే కపాస్ కిషన్ యాప్ ఉంటేనే పత్తి పంట అమ్ముకునే వీలుంటుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. రైతులు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచిస్తున్నారు. బుధవారం మండలంలోని కౌటాబి గ్రామంలో ఏఈఓ వాజిద్, పలు గ్రామాల రైతులకు ఈ విషయమై పూర్తి అవగాహన కలిగించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు ఈ సందర్భంగా సూచించారు.

కాంగ్రెస్‌లో పలువురు నాయకుల చేరిక

నేరడిగొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బజార్హత్నూర్ మండలంలోని డిగ్నూర్, గిర్నూర్, బోస్రా, గంగాపూర్, గ్రామానికి చెందిన దాదాపు 30మంది బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గంలో అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే, ఆడే గజేందర్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదవారికి చేరుతున్నాయని, అందుకే పార్టీలో చేరుతున్నారని తెలిపారు. వారిలో సురేఖ రాథోడ్, ప్రకాష్ రాథోడ్ గొల్లనాగు నర్సయ్య (వైఎస్) కొమురంరాము, అదుముల నగేష్, అడెల్లు, శేషారావు సంతోష్, బాలాజీ, సంజు, శేషరావు, కృష్ణ, రాంజీ పటేల్, మంతు పటేల్, శశికాంత్, వినోద్, నాగనాథ్ పటేల్ దాదాపు 30 మంది చేరారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడాఈరు.

అన్ని స్థానాలు కైవసం : ఎంపీ నగేష్

నేరడిగొండ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ అన్ని స్థానాలను కైవసం చేసుకుంటుందని ఎంపీ గోడం నగేష్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలందరూ సమష్టిగా సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలను బీజేపీ పార్టీ బలపర్చిన అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఆకుల రాజశేఖర్, బీజేపీ నాయకులు తాటిపల్లి రాజు, గడ్డం భీంరెడ్డి, గాదె శంకర్, మహేందర్ రెడ్డి, గూడ రాజురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై ఆర్వోలకు శిక్షణ

బోథ్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల పైన బుధవారం ఎంపీడీవో రమేష్ వివిధ గ్రామాలలో ఎన్నికలు నిర్వహించే ఆర్వోలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రభుత్వా నియమ నిబంధనల ప్రకారం ఎన్నికలను పూర్తి చేయాలన్నారు. ఎలాంటి ఒత్తిడిలకు లొంగకుండా ప్రభుత్వం ఇచ్చిన గైడ్ లైన్స్‌పై ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్వోలు పాల్గొన్నారు.

నాలుగు కంప్యూటర్ల వితరణ

ఉట్నూర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొమురం భీం ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న బీకాం విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన కార్పొరేట్ ఉద్యోగి సునీల్ నాలుగు కంప్యూటర్‌లను విరాళంగా అందించారని కళాశాల ప్రిన్సిపల్ ప్రతాప్ సింగ్ తెలిపారు. గిరిజన విద్యార్థులకు చేసిన ఈ సహాయము మరువలేనిది అని కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ అన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

● ఎంపీ గోడం నగేష్‌కు బీజేపీ కార్యకర్తలు, రైతుల విన్నపం

ఇంద్రవెల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో భాగంగా సాగు చేసిన మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించి రైతులకు మద్దతు ధర కల్పించడానికి కృషి చేయాలని ఇంద్రవెల్లి బీజేపీ కార్యకర్తలు, రైతులు ఎంపీ గోడం నగేష్‌కు విన్నవించారు. బుధవారం ఎంపీ క్యాంప్ కార్యాలయాన్ని సందర్శించి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేంద్రే బాలాజీ, కో కన్వీనర్ అరెల్లి రాజలింగు, నాయకులు ఆర్క ఖమ్ము, హెరేకుమ్ర అనిల్‌కుమార్, దిలిప్ మోరే, కనక హనుమంత్‌రావు, భీంరావు, కోవ రాజేశ్వర్, జైస్వాల్, శివకుమార్, మెస్రం తుకారం, రాజువర్ధన్, సాయి ముండే, తదితరులు ఉన్నారు.



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు, రైతులు

పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు



మాట్లాడుతున్న ఇచ్చోడ సీఐ బండారి రాజు

నేరడిగొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టామని ఇచ్చోడ సీఐ బండారి రాజు తెలిపారు. స్థానిక పోలీసు ఆవరణలో స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేరడిగొండలో గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. మండల పరిధిలో 32 పంచాయతీలకు సంబంధించి 23వేల 869 మంది ఓటు హక్కును సజావుగా వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉంటే వెంటనే 1077 నెం. ద్వారా సంప్రదించాలని, అన్ని పార్టీల నాయకులు పోలీసు అధికారులకు సహకరించాలన్నారు. రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా ఓటర్లను ప్రలోబాలకు గురిచేసినా చర్యలు తప్పవన్నారు. ఈసమావేశంలో ఎస్ఐ ఇమ్రాన్ ఆయా పార్టీల నాయకులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



● కోత దశలో కనిపిస్తున్న సోయా పంట

అష్టకష్టాలు పడి.. పండించిన సోయా పంటపై ఆశలు గల్లంతవుతున్నాయి. జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. గత పక్షం రోజుల క్రితమే పంట కోతకు వచ్చినా.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఏమీ చేయలేని పరిస్థితి ఎదురవుతుంది. దీంతో కాయలు నల్లబడిపోయి నేల రాలుతున్నాయి. చేతికి వచ్చే సమయంలోనే భారీ వర్షాలు కురవడంతో అన్నదాతలు ఆగమవుతున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఇప్పటి వరకు సగానికి పైగా పంట కోతలు పూర్తయ్యేవని రైతులు పేర్కొంటున్నారు.

ఆశలు.. ఆవిరి!

- జిల్లాలో చేతికి వచ్చిన సోయా పంట
- పంట కోతకు ఆటంకంగా మారుతున్న వర్షాలు
- నాణ్యత దెబ్బతినడంతో దిగుబడులపై ప్రభావం
- తేమ పేరిట ధరలో కోతలు విధిస్తున్న దళారులు
- పెట్టుబడులు చేతికి రావడం లేదంటున్న రైతులు
- జిల్లావ్యాప్తంగా ఈ యేడు 82వేల ఎకరాలలో సాగైన సోయా



● జిల్లాలో ఇటీవల ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు మొలకెత్తిన సోయా కాయలు

ఎడతెరపిలేని వర్షాలతో రైతుల ఆందోళన

ఆదిలాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 82వేల ఎకరాలలో సోయా పంటసాగైంది. ఈ యేడు సోయా క్వింటాల్ మద్దతు ధర రూ.5,328గా ప్రభుత్వం నిర్ణయించింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో ఎకరాన 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడులు మాత్రమే వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ లెక్కన 4లక్షల క్వింటాళ్లకుపైగా సోయా పంట దిగుబడులు వస్తాయ ని మార్కెటింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు. అక్కడక్కడ పంటను కోసి నూర్పిడి చేస్తున్న ఆరబెట్టేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎప్పుడు వర్షం వస్తుందో? తెలియని పరిస్థితి ఉందంటున్నారు. దీంతో రైతులు పంట కుప్పల వద్దనే రోజంతా పడిగాపులు కాస్తున్నారు.



నిలిచిపోతున్న కోతలు

సోయా పంట కోతకు వచ్చినా.. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలతో పంట కోతకు తీవ్ర ఆటంకంగా మారింది. జిల్లాలో ఎక్కువగా నల్లరేగడి నేలలే కావడంతో అధిక తేమ కనిపిస్తుంది. దీంతో యంత్రాల సహాయంతో పంట నూర్పిడికి అవకాశమే లేకుండా పోతుంది. ప్రత్యామ్నాయంగా కూలీలతో పంటను కోసి కుప్పలు వేసిన నూర్పిడి చేసేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కురుస్తున్న వర్షాలకు సోయా పంట నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంటుందని అన్నదాతలు వాపోతున్నారు. ఇప్పుడిప్పుడే కోత పనులు ఊపందుకుంటున్న కురుస్తున్న వర్షాలకు పంట నూర్పిడి పనులు నిలిచిపోతున్నాయి. టార్పలిన్ కవర్లతో పంటను కాపాడుకునేందుకు రైతులు నిత్యం ఉరుకులు పరుగులు పెడుతున్నారు. వెంటాడుతున్న వర్షాలతో పంటలను అమ్ముకోవాలన్నా అవస్థలు పడాల్సి వస్తుందని అన్నదాత లు ఆందోళనకు గురవుతున్నారు.

మొలకెత్తుతున్న సోయా

పంట కోతలు ఆలస్యం కావడంతో నిలువు పైననే సోయా పంట మొలకెత్తుతుంది. దీంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నదాతలు వాపోతున్నారు. అంతేకాకుండా నాణ్యత దెబ్బతినడంతో దిగుబడులు భారీగా తగ్గుతున్నాయి. ఎకరాన నాలుగైదు క్వింటాళ్ల వరకే దిగుబడులు వస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితులతో పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రావడం కష్టమేనంటున్నారు. మొలకెత్తిన సోయలను కొనుగోలు చేసేందుకు అవకాశం ఉండదంటున్నారు.కొన్ని చోట్ల పంట నాణ్యత పూర్తిగా దెబ్బతినడంతో నూర్పిడి చేయకుండానే వదిలేస్తున్నారు. ఆశించిన దిగుబడులు రాక నూర్పిడి యంత్రాల ఖర్చులకు కూడా సరిపోవడం లేదంటున్నారు.

అధిక వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నాం
: నారకట్ల యాదవ్, రైతు, జైనథ్ గ్రామం



మునుపెన్నడూ లేనివిధంగా ఈ యేడు అక్టోబరు మాసంలోనే భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రస్తుతం సోయా, పత్తి పంటలు చేతికొచ్చిన అమ్ముకునే పరిస్థితి కనిపించడం లేదు. సోయలు మొలకలు రావడంతో నాణ్యత దెబ్బతిని పనికి రాకుండా నే పోతుంది. ఫసల్‌బీమా సౌకర్యం ఉంటే రైతులకు ఎంతో మేలు జరిగేది. ఎన్నో ఆశలతో పంటలను సాగు చేసినా ప్రయోజనం లేకుండా పోతుంది.

దళారుల ఇష్టారాజ్యం

పంట నాణ్యతగా లేదంటూ దళారులు కొనుగోళ్లకు కొర్రీలు పెడుతున్నారు. వ్యాపారులంతా కుమ్మకై ధరల్లో కోతలు విధిస్తున్నారు. మద్దతు ధర రూ.5,328 కాగా.. ప్రస్తుతం బయట మార్కెట్‌లో రూ.4 వేల నుంచి రూ.4500 వరకు మాత్రమే ప్రైవేట్ వ్యాపారులు

(తరువాయి 7వ పేజీలో....)



మావల మండల కేంద్రంలో నామినేషన్ల స్వీకరణపై సలహాలు సూచనలు చేస్తున్న అధికారులు

నేటి నుంచే.. ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్లు

- మొదటి విడతలో 10 మండలాల్లో ఎన్నికలు
- ఏర్పాట్లను సిద్ధం చేసిన అధికారులు

ఆదిలాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రకారమే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. గురువారం నుంచి తొలివిడత ఎన్నికలకు సంబంధించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి 5 గంటల వరకు నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్లు మండల పరిషత్ కార్యాలయంలో దాఖలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. మొదటి విడతలో బోథ్ నియోజక వర్గంలోని 10 మండలాల పరిధిలో 10 జడ్పీటీసీ స్థానాలతో పాటు 80 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.ఇందులో బజార్‌హత్నూర్, భీంపూర్, బోథ్, ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, సిరికొండ, సోనాల, తలమడుగు, తాంసి మండలాలు ఉన్నాయి. నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు మండల పరిషత్ కార్యాలయం వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. బీసీ రిజర్వేషన్ల పై హైకోర్టు తీర్పును గురువారానికి వాయిదా వేయడంతో అంతటా అదే ఉత్కంఠ కొనసాగుతుంది. అయిన షెడ్యూల్ ప్రకారమే యదావిధిగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్లను స్వీకరిస్తారు.

నామినేషన్ల స్వీకరణ	: అక్టోబరు 9వ తేదీ నుంచి 11వ తేదీ (సాయంత్రం 5గంటల వరకు)
నామినేషన్ల పరిశీలన	: అక్టోబరు 12వ తేదీ
ఉప సంహరణ	: అక్టోబరు 15వ తేదీ (మధ్యాహ్నం 3గంటల వరకు)
అభ్యర్థుల జాబితా విడుదల	: అక్టోబరు 15వ తేదీ సాయంత్రం

తరలించిన కలెక్టరేట్ కార్యాలయాల వివరాలివే..

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కలెక్టర్ కార్యాలయం పాక్షికంగా కూలిన నేపథ్యంలో అధికార యంత్రాంగం పలు కార్యాలయాలను మార్చింది. దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచనల మేరకు కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని పలు ముఖ్య కార్యాలయాలను ఇతర భవనాలకు తరలించడం జరిగింది. ఉద్యోగులు, ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉండడంతో తాత్కాలికంగా వాటిని ఇతర భవనాలకు మార్చినట్లు కలెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కార్యాలయాన్ని పెన్‌గంగ భవన్‌కు, కలెక్టరేట్ విభాగాల కార్యాలయాలను పెన్‌గంగ భవన్‌కు, అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని జడ్పీ కార్యాలయానికి తరలించినట్లు వెల్లడించారు. జిల్లా ప్రజలు కార్యాలయ మార్పులను గమనించి సంబంధిత శాఖల సేవల కోసం తాజా చిరునామాలను సంప్రదించాలని సూచించారు.

‘ఓపెన్ స్కూల్’కు గడువు పెంపు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓపెన్ స్కూల్ (టాస్) విధానంలో అడ్మిషన్ల కోసం గడువును మరొకసారి పొడగించినట్లు జిల్లా విద్యాశాఖధికారి ఖుష్బూగుప్త బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి అపరాద రుసుము లేకుండా ఈ నెల 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. అపరాద రుసుముతోఈనెల 14వ తేదీ నుంచి 23వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఈఎల్‌ఏఎన్‌జీఏఎన్‌ఏంపీఈఎస్‌ఎస్‌సీహెచ్‌ఒంఎల్.ఓఆర్‌జీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని అడ్మిషన్ ఫీజు చెల్లించి రసీదు పొందాలని సూచించారు. సంబంధిత అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్ ఫారం ప్రింట్ తో పాటు ధ్రువపత్రాలను సమర్పించాలని డీఈవో సూచించారు.

తపాలా సేవలు.. సాంకేతికత వైపు పరుగులు!

● డిజిటల్ బాట పట్టిన తపాలా శాఖ ● నాణ్యమైన సేవలందించడమే లక్ష్యంగా ముందుకు కదులుతున్న యంత్రాంగం

గతంలో లేఖలు.. పంపడం, నగదు జమకు పరిమితమైన తపాలా శాఖ సేవలు ప్రస్తుతం తన పరిమితిని పెంచుకుంటూ విస్తరిస్తోంది. రోజురోజుకు అందుబాటులోకి వస్తున్న అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుంటూ.. డిజిటల్ బాటలో నడుస్తోంది. ప్రజలకు సరికొత్త సేవలందిస్తూ మన్ననలు పొందుతోంది. ప్రపంచ తపాలా దినోత్సవం రోజున తపాలా శాఖ పురోగమనంపై ‘ఆంధ్రజ్యోతి’ ప్రత్యేక కథనం...

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు లేఖల బట్వాడా, నగదు జమ, వస్తువుల ట్రాన్స్‌పోర్ట్‌కు పరిమితమైన తపాలా తన సేవలను విస్తృతం చేస్తోంది. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ నాణ్యమైన సేవలను అందించడమే లక్ష్యంగా ముందుకు కదులుతోంది. తాజాగా డిజిటల్ సేవల దిశగా తపాల శాఖ ముందడుగు వేయడం విశేషం. కాగిత రహితంగా, డిజిటల్ విధానంలో వినియోగదారులు, ఖాతాదారులకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు వీలుగా సాఫ్వేరు అప్‌డేట్ చేశారు. ఆదిలాబాద్ పోస్టల్ డివిజన్ పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లోని అన్ని పోస్టల్ కార్యాలయాల్లో ఇటీవల 2.0 సేవలు ప్రారంభమయ్యాయి. తపాల శాఖ ద్వారా నిర్వహించే లావాదేవీలు, రిజిస్ట్రేషన్‌లు, పార్శిల్ సర్వీస్ బుకింగ్, నగదు జమ, ఉపసంహరణలన్నీ కాగితం ఆధారంగా చేయాల్సి వచ్చేది. ఇందు కోసం ఖాతాదారులు, వినియోగదారులు నేరుగా కార్యాలయానికి రావాల్సి ఉండేది. అయితే 2.0 విధానం ద్వారా తపాల శాఖ సేవలన్నీ డిజిటల్ రూపంలో అందుబాటులోకి వచ్చాయి. మొబైల్ యాప్ లేదా పోస్టల్ ఆఫీషియల్ వెబ్‌సైట్ ద్వారా స్మార్ట్ ఫోన్ సాయంతో ఇంటి వద్ద... కూచున్న చోటు నుంచే సేవలను పొందే సౌకర్యం కల్పించారు. దేశ వ్యాప్తంగా ఎక్కడి నుంచైనా డిజిటల్ చెల్లింపులు జరుపుకునే సదుపాయం కల్పించారు. రిజిస్ట్రేషన్, స్పీడ్ పోస్టు, పార్శిల్ బుకింగ్‌ను ఇంటి నుంచే చేసుకోవడ్డమే కాకుండా వాటిని మరింత ఖచ్చితత్వంతో ట్రాక్ చేసుకునేందుకు వీలు కల్పించారు.



● ఆదిలాబాద్ పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయం

ఉమ్మడి జిల్లాలో తపాలా కార్యాలయాల వివరాలు ఇలా..

- హెడ్ పోస్ట్ ఆఫీస్‌లు : 2
- సబ్ పోస్ట్ ఆఫీస్‌లు : 63
- బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లు : 520



సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో

అలుగును తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

● నాన్ బెయిలబుల్ కేసులు : డీఎఫ్ఓ వెల్లడి

ఆదిలాబాద్ టౌన్/ఆదిలాబాద్(నార్నూర్), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అటవీ క్షేత్రంలో కనిపించే అరుదైన అలుగును అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించిన వ్యక్తులను అరెస్టు చేశామని, అలుగును స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఇన్‌చార్జి అటవీ అధికారి రేవంత్ చంద్ర తెలిపారు. పట్టణంలోని అటవీ కార్యాలయంలో బుధవారం ఆయన కేసు వివరాలను వెల్లడించారు. గాదిగూడ మండలం అర్జుని గ్రామంలో దొరికిన అలుగును నిందితులు విక్రయించేందుకు ప్రయత్నం చేసినట్లు డీఎఫ్ఓ తెలిపారు. ఈ ఘటనలో కినక శంకర్, పెందుర్ జుగ్నాథ్, పెందుర్ మహేష్‌లను అరెస్ట్ చేశామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. అలుగును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అరుదుగా కనిపించే అలుగుకు విదేశాల్లో డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, ఇక్కడి నుంచి వాటిని అక్రమంగా తరలించే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. వన్య ప్రాణులను వేటాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అరెస్ట్ చేసిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వన్య ప్రాణుల సంరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత అని తెలిపారు. అటవీ సంపద అక్రమ తరలింపును నిరోధించేందుకు అటవీ శాఖ పటిష్ట చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న అలుగు

ఆర్టీసీకి దసరా ధమాకా



- ఆదిలాబాద్ రీజియన్‌కు కలిసొచ్చిన పండగ
- రూ.1.85 కోట్లు ఆర్జించిన రోడ్డు రవాణా సంస్థ
- ఆర్ఎం భవానీ ప్రసాద్ వెల్లడి

7

రేండ్లపల్లిలో ఆవుపై చిరుత దాడి

బోథ్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు సడుమకి లక్ష్మణ్‌కు చెందిన ఆవు పైన మంగళవారం చిరుత పులి దాడి చేసింది. ఈ సంఘటనలో ఆవు మృతి చెందింది. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు మంగళవారం సంఘటన స్థలానికి వెళ్లి శవ పంచనామ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వన్యప్రాణులకు ఎలాంటి హాని చేయవద్దని దాడుల్లో చనిపోయిన పశువులకు పరిహారం ఇవ్వడం జరుగుతుందని రేంజ్ అధికారి ప్రణయ్ పేర్కొన్నారు. ఏదేమైనా బోథ్ అడవుల్లో పులి చిరుతల దాడులతో రైతులు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు.



చిరుత దాడిలో మృతి చెందిన ఆవు

పల్లెల అభివృద్ధికి ప్రత్యేక కృషి : ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని పొన్నారి, హసనాపూర్ గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనలో పల్లెలు, పట్టణాలు, గ్రామాలు సంపూర్ణ అభివృద్ధిని సాధించాయని అన్నారు. ప్రస్తుతం పల్లెల అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా విద్యావంతులైన యువత తమకు సహకరించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తాను ప్రతిపాదించిన అభ్యర్థిని అత్యధిక మెజార్టీలతో గెలిపించాలని కోరారు. రైతుల సంక్షేమ కోసం అందుబాటులో ఉంటానఅన్నారు. ఈ సందర్భంగా పలువురు మృతుల కుటుంబాలను పరామర్శించి నివాళులు అర్పించారు. ఇందులో మాజీ ఎంపీటీసీ ముచ్చ రేఖ రఘు, మాజీ సర్పంచ్ అశోక్, అరుణ్, రమణ, తదితరులు ఉన్నారు.